క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

అల్లాదుర్గం(మెదక్): కల్యాణ లక్ష్మి పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్షా 16 చెక్కులను సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 101 చెక్కులు మంజూరు కాగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సతీశ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభు, బాలకిషన్, రఘు, అంజాగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి

అల్లాదుర్గం(మెదక్): ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్‌తో లోఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో బోర్ల వద్ద మోటార్లు కాలిపోతున్నాయని మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని అల్లాదుర్గం విద్యుత్ కార్యాలయంలో ఏఈ శివాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోతున్నాయిని చెప్పారు.

భూ హక్కు పత్రాలు ఇవ్వండి

హవేళిఘణాపూర్(మెదక్): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించి పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హవేళిఘణపూర్ తహసీల్దార్ నారాయణకు మండల రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్న తమకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే సాగులో ఉన్న తమకు పోడు పట్టాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, వెంకటి, పీర్య, తదితరులు ఉన్నారు.

భూమిని రక్షించండి



వినతిపత్రం అందిస్తున్న పర్కిబండ గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): ఆక్రమణకు గురవుతున్న గ్రామకంఠం భూమిని సంరక్షించాలని, 40 కుటుంబాల కోసం అందులోంచి రోడ్డును వేయాలని పలువురు గ్రామ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ కౌశికకు వినతి పత్రం సోమవారం అందజేశారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తుల వెల్లువ



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

శివ్వంపేట(నర్సాపూర్): 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి గృహజ్యోతి ద్వారా జీరో బిల్లురాకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంకు భారీగా తరలివచ్చారు. చాలా మంది వినియోగదారులు 200 యూనిట్ల విద్యుత్ వాడిన వారికి జీరో బిల్లు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఎంపీడీఓ కార్యాలయంలో 170 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ నగేశ్వర్‌గుప్తా తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మెదక్ డీఎస్పీ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ రాజేశ్వర్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌కు నూతనంగా వచ్చిన డీఎస్పీ రాజేశ్వర్ సోమవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఫణింద్ర బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రాజేశ్వర్ వచ్చారు.

నివారణ చర్యలతో పంటలు భద్రం

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన నివారణ చర్యలు పాటిస్తే పంటలు భద్రంగా ఉండడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు, సోమవారం ఆయన మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలో వరిసాగును పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ పోచయ్య, రైతులు ఉన్నారు.

పని చేయని అధికారులెందుకు?

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గైర్హాజరుపై ఆగ్రహం

- హవేళిఘణాపూర్ సర్వసభ్య సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్



మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి రేంజ్ ఆఫీసర్ గైర్హాజరు కావడం ఏమిటని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ యమున అధ్యక్షతన నిర్వహించిన హవేళిఘణాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... మండలంలో భూ సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిపై చర్చించుకునేందుకు ఉన్నతాధికారులు కాకుండా కింది స్థాయి అధికారులను పంపిస్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేయని అధికారులను ఉపేక్షించబోమన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. పాతూర్ ఫీడర్‌ను వేరు చేసి కరెంట్ సమస్య లేకుండా చూడాలని ఎంపీటీసీలు కోరారు. విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. అధికారులకు ప్రజలు సహకరించాలి తప్ప ఇబ్బందులు కలిగించేలా చేయడం సరికాదని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని, ఎక్కడైనా డ్రగ్స్ విక్రయించినట్లు తేలితే వాటిని కట్టడి చేసి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉందన్నారు. ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పరిష్కరిస్తానని, అవసరమైన సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఆంజనేయులు, మెదక్ సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో రఘు, అధికారులు శ్రీహరి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

హక్కుల కోసం మహిళలు పోరాడాలి



మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలు

మెదక్ కలెక్టరేట్: మహిళలు హక్కుల కోసం పోరాడాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు మహిళలు వంటింటి నుంచి అంతరిక్షం వరకు పయనిస్తున్నారని తెలిపారు. జ్ఞానవంతులుగా విద్యావంతులుగా మహిళలు ఎదగాలని సూచించారు.

పట్టా సర్టిఫికెట్లు జారీ చేయాలి

మెదక్ కలెక్టరేట్: ఇనాం భూములకు ప్రభుత్వం వెంటనే పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బాధిత రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేగోడ్ గ్రామానికి చెందిన నిరుపేద ఎస్సీ కుటుంబ సభ్యులకు గ్రామ శివారులో ఇనాములు ఉన్నట్లు తెలిపారు. ఈ భూమిలో కబ్జాలో ఉండి వారసత్వంగా పంటలు పండించుకొని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. కానీ కొన్ని సంవత్సరాలుగా ఈ భూమిని అనుభవిస్తున్న వారికి భూములపై ఇనాం దారు పట్టా సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ సర్దార్, సంతోష్, నాయకులు అనిల్, బాధితులు శ్రీశైలం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పల్స్ పోలియో చుక్కలు



ఎద్దశంకరంపేట(మెదక్): బద్దారంలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు సోమవారం ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు చుక్కల మందు వేశారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు, అంగన్‌వాడీ టీచర్లు రెండోరోజు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌడిపల్లి బస్టాండ్‌వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బూత్‌లో పిల్లలకు రెండోరోజు పోలియో చుక్కలు వేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గ్రామాల్లో రెండో రోజు చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్లు, వైద్యారోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు.

స్వాగత బోర్డు ఏర్పాటు



కాలనీ స్వాగత బోర్డు ఆవిష్కరణలో చైర్మన్, ఇతర నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని 9వ వార్డు పరిధిలో మారుతినగర్ కాలనీకి ఏర్పాటు చేసిన స్వాగత బోర్డును మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌తో పాటు మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులను కాలనీవాసులు శాలువాలతో సన్మానించారు.

వేలంకు ముందుకు రాని ఔత్సాహికులు



రెవెన్యూ అధికారులతో వాగ్వాదం చేస్తున్న తిరుపతిరెడ్డి, భరత్‌కుమార్

శివ్వంపేట(నర్సాపూర్): ఎఫ్‌సీఐకి చెల్లించాల్సిన బియ్యం చెల్లించని రైస్‌మిల్ యాజమాని భూముల వేలం పాటలో పాల్గొనడానికి ఔత్సాహికులు రెండోసారి ముందుకు రాలేదు. మండల పరిధిలోని రత్నపూర్ గ్రామ పరిధిలోని లక్ష్మీనర్సింహా రైస్‌మిల్ యాజమాని లింబాద్రిరావ్ ఎఫ్‌సీఐకి 4 కోట్ల 40 లక్షలు భాకీ ఉన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. యాజమానికి పలుమార్లు నోటిసులు జారీ చేసినా.. స్పందన లేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైస్‌మిల్ యాజమానికి సంబంధించిన భూములను సోమవారం రత్నపూర్ పంచాయతీ వద్ద రెండో సారి బహిరంగంగా వేలం పాట నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు ఔత్సాహికులు ముందుకు రాలేదు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 4 కోట్ల 40 లక్షలకు గాను 80 లక్షలు కోర్టు ద్వారా చెల్లించారని, మిగతా డబ్బులు వారం రోజుల్లో చెల్లించకపోతే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫియొద్దీన్, ఆర్ఐ కిషన్, సునీల్, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం

ఎఫ్‌సీఐకి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించేందుకు సమయం తీసుకుంటూ కోర్టు ద్వారా స్టే ఆర్డర్ తెచ్చినప్పటికీ రెవెన్యూ సిబ్బంది భూముల వేలం పాట నిర్వహించారని లక్ష్మీనర్సింహ రైస్‌మిల్ యాజమాని కుటుంబ సభ్యులు తిరుపతిరెడ్డి, భరత్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. హైకోర్టు 5 వారాల గడువు ఇచ్చిందని అప్పటి వరకు భూముల వేలం పాట నిర్వహించకూడదని చెప్పినా.. అధికారులు వినిపించుకోవడం లేదన్నారు.

కనులపండువగా మల్లన్న జాతర



వెల్దుర్తి(తూప్రాన్): మల్లన్న కల్యాణం చేస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్): జాతరలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరిల గ్రామంలో మల్లన్న ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శేరి గ్రామంలో రెండోరోజు అగ్నిగుండాలు, బోనాలు ఊరేగింపు, మల్లన్న కల్యాణంతో పాటు బీరప్పకు ఎడ్లబండ్లను ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చెన్నాపూర్‌లో మల్లన్న జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర మహోత్సవం కనుల పండువగా ప్రారంభమైంది. అందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి జాతరకు హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు చంద్రగౌడ్, భిక్షపతి, హన్మంత్‌రెడ్డి, రాంచంద్రగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, యుద్దంరెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

చందాయిపేటలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో కేతకీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై దైవదర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జెడ్పీటీసీ శ్రీనివాస్, సహకార సంఘం చైర్మన్ కొండల్‌రెడ్డి, యాదవ సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావెల్లిలో..

తూప్రాన్: పట్టణ పరిధిలోని రావెల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్, మల్లేశ్, శ్రీనివాస్ యాదవ్, మహేశ్ యాదవ్, పోచయ్య, ఐలయ్య యాదవ్, యాదవ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సభను విజయవంతం చేయండి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విజయ సంకల్ప సభ ఏర్పాటులో భాగంగా ఈనెల 5న, సంగారెడ్డిజిల్లాలోని పటేల్‌గూడలో జరిగే సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బీజేపీ మాట్లాడుతూ... మరోసారి మోదీని ప్రధానమంత్రిగా గెలిపించాలని, అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎస్ రెడ్డి, మెదక్ పట్టణాధ్యక్షుడు ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): ప్రధాని భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఎల్లుపేట రాజు తెలిపారు. టేక్మాల్ చౌరస్తాలో మోదీ సమావేశ జన సమీకరణ సమావేశాన్ని నిర్వహించారు.

అటవీ భూముల నుంచి మట్టి తరలింపు

పాపన్నపేట(మెదక్): అటవీ భూముల నుంచి వందల కొద్ది టిప్పర్ల మట్టి అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులు పట్టించు కోవడం లేదు. నాగ్సాన్‌పల్లి శివారులోని ఉమాకేదారీశ్వర ఆలయ సమీపంలోని అటవీ భూముల నుంచి టిప్పర్లలో మట్టిని ఏడుపాయల జాతర పనుల కోసం తరలిస్తున్నారు. ఏటా ఇదే ప్రాంతం నుంచి వందల కొద్ది టిప్పర్లలో జేసీబీతో మట్టిని తరలించడంతో అటవీ భూముల్లో పెద్ద కందకాలు ఏర్పడి వర్షాకాలంలో నీటితో నిండి మనుషులు, మూగ జీవాల పాలిట మృత్యు కుహరాలుగా మారుతున్నాయి. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇళ్లు కట్టుకుందామంటే ట్రాక్టర్ మట్టికి అనుమతి ఇవ్వని అధికారులు, అటవీ భూముల నుంచి వందల కొద్ది టిప్పర్లలో మట్టి తరలిస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

దారిని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



దారిని చూపుతున్న రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న కనికల చెరువు కట్టమైసమ్మ ఆలయానికి వెళ్లేదారిని ధ్వంసం చేసిన సదాశివపల్లి మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని రాజేందర్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం కట్టమైసమ్మ వద్ద దారిలో గుంతలు తీసి ధ్వంసం చేసిన స్థలాన్ని గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాములు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లులకు పోషకాహారం తప్పనిసరి



సామూహిక సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులకు తల్లులకు పోషకాహారం ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి ఉపయోగకరమన్నారు. బిడ్డకు పాలు తాగించడం గురించి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగరాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం



ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తును స్వీకరిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ శ్రీధర్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని మెదక్ ఎంపీపీ యమునరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆంజనేయులు, ఎంపీడీఓ రఘు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

రేగోడ్(మెదక్): గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు సంబంధించిన దరఖాస్తులు ప్రతీ రోజూ స్వీకరిస్తామని ఎంపీడీఓ సీతారావమ్మ సోమవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫ్రీ కరెంట్ కోసం 20 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేశారని తెలిపారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలో ఎంపీపీ స్వప్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, ఎంపీటీసీ అంజమ్మ, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్, సూపరింటెండెంట్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మహిళ అదృశ్యం**



సుశీల

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గంగాయిపల్లిలో మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ముల సుశీల ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకలేదు. దీంతో సోమవారం ఆమె కొడుకు అర్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

◆ **హామీలను వెంటనే నెరవేర్చాలి**

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ నాయకులు రైతులకు సాగుకు నీళ్లు, రూ. 2లక్షల రుణమాఫీ హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కాళ్లకల్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, కూచారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నరేశ్‌లున్నారు.

◆ **జీరో కరెంట్ బిల్ అందజేత**

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు వినియోగదారులకు కాంగ్రెస్ మండల ఓబీసీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ జీరో బిల్లు అందజేశారు.

◆ **ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి**



పాపన్నపేట(మెదక్): నిత్యం దైవారాధన చేయడం ద్వారా ఆధ్యాత్మిక చింతనతో పాటు, ముక్తి లభిస్తుందని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామిజీ అన్నారు. సోమవారం మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులో ఉన్న సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్ శర్మ, శ్యాం సుందర్‌శర్మ, గ్రామస్తులు తదితరులున్నారు.

◆ **విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయండి**

మనోహరాబాద్(తూప్రాన్): తమ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని కాళ్లకల్ గ్రామస్తులు సోమవారం ఏఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో గాంధీ నగర్ బస్తీలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు లేక ఇక్కట్ల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు**

మెదక్ మున్సిపాలిటీ: ఎల్లమ్మ ఆలయ 30 వార్షికోత్సవాలను పురస్కరించుకొని పట్టణ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణోత్సవం జరిపించారు. ఉత్సవాలు గౌడ సంఘం అధ్యక్షుడు సురేందర్ గౌడ్, శ్రీనివాస్ శర్మ, కృష్ణమూర్తి సిద్ధాంతి, వేదవ్యాస్, శ్రీవాండ్ల శ్రీనివాస్ శర్మ, లింగమూర్తి శర్మ, గౌడ్ సంఘం డైరెక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **దుర్గమ్మ సన్నిధిలో హోమం**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ శివారు వనదుర్గా ప్రాజెక్ట్ ఎగువ భాగంలోని దుర్గాదేవి ఆలయ సన్నిధిలో సోమవారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం హోమం చేశారు.

◆ **ఎమ్మెల్యేకు ఆహ్వానం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని రుద్రారం గ్రామంలోని సంగమేశ్వర ఆలయ 75వ వార్షికోత్సవాలకు రావాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను ఆహ్వానించారు.

మీర్జాపల్లి గ్రామంలో..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మీర్జాపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మల్లన్న ఆలయ ఉత్సవాలకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష**

పాపన్నపేట(మెదక్): మద్యం సేవించి నిర్లక్ష్యంగా ఆటో నడిపి పల్టీ కొట్టించిన డ్రైవర్‌కు స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి కల్పన సోమవారం ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

◆ **వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**

తూప్రాన్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి బుచ్చానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఘనపూర్, ఇమాంపూర్, ఇమాంపూర్ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.

◆ **సన్మానం**



శివ్వంపేట(నర్సాపూర్): నూతనంగా బాధ్యతలు చేపట్టిన తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణను సోమవారం తెలంగాణ రైతుల రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగౌడ్, నాయకులు వీరేష్, వెంకటేష్, అశోక్‌రెడ్డి, నర్సరెడ్డి, ఐలేష్ సన్మానించారు.

◆ **గోశాల ప్రారంభం**

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో అవని వెంచర్‌లో శ్రీ వాసు గౌతమ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గోమాతలకు అవసరమైన గ్రాసాలను, పక్షుల కోసం ప్రత్యేక గూడులు కలిగిన మీనార్‌ను ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణలేనే మొదటి గూడు అని నిర్వాహకులు తెలిపారు.